సాక్షి
నల్లగొండ
సోమవారం, 25, నవంబర్, 2024



రుణమాఫీలో విఫలం
రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. - 8లో



భక్తజన సందోహం
కార్తీక మాసం సందర్భంగా చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. - 8లో



ఆత్మగౌరవం దెబ్బతీస్తే..
బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు సీపీఎం జిల్లా కమిటీ సమావేశం

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం జిల్లా కమిటీ సమావేశం సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి



ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీని వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డాటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిప్పర్తి మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈఓ భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

29న నల్లగొండలో దీక్షా దివస్



మాట్లాడుతున్న రవీంద్రకుమార్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలో ఈ నెల 29న దీక్షా దివస్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నిరాహార దీక్షకు దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ప్రకటించిందన్నారు. దీక్షా దివస్ విజయవంతం కోసం ఈ నెల 26న నల్లగొండలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మలే శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, దేప వెంకటరెడ్డి, గణేష్, కొండూరి సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, యుగేందర్‌రెడ్డి, మైనం శ్రీనివాస్, శంకర్, కె.లక్ష్మయ్య, కృష్ణ, బొజ్జ వెంకన్న, జంగయ్య, రాజేందర్, సునందరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఆదోని వెంకటరమణారావు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని కాపురాల గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని యునెస్కో సభ్యుడు ఆదోని వెంకటరమణరావు అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణం పాతబస్తీలోని ఆర్య సమాజ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని కాపురాల గుట్టను ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కోరినట్లు తెలిపారు. గుట్ట పైకి రోడ్డును నిర్మిస్తే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలుచ సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ చూపి కాపురాల గుట్టను అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఓగ్గు గణేష్, రాంప్రసాద్, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.







ఉన్ని దుస్తులకు గిరాకీ..

వాతావరణంలో మార్పు వచ్చింది. చలి క్రమేణా పెరుగుతోంది. చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉన్ని దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మకందారులు నల్లగొండలో పెద్ద సంఖ్యలో దుకాణాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

'యాంత్రీకరణ'.. పునరుద్ధరణ!

- ఆరేళ్ల క్రితం నిలిచిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- అప్పటినుంచి రైతులకు అందని సబ్సిడీ పరికరాలు
- పథకాన్ని మళ్లీ అమలుచేసే యోచనలో ప్రభుత్వం
- సమాచారం సేకరిస్తున్న యంత్రాంగం



నల్లగొండ అగ్రికల్చర్: ఆరేళ్ల క్రితం నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తామని ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. దీంతో రైతుల్లో యంత్ర సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో ఈ పథకం అమలైనప్పుడు జిల్లాలో ప్రతి సీజన్‌లో అర్హతలను బట్టి సుమారు 3 వేల నుంచి 4 వేల మంది రైతులు లబ్ధి పొందినట్టు వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

2018లో నిలిచిన పథకం

2014వ సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాత్రీకరణ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద రైతులకు 50 శాతం సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలైన ట్రాక్టర్లు, టిల్లర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు, కల్టివేటర్లు, రోటోవేటర్లు, నాగళ్లు, హార్వెస్టర్లు తదితర వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించింది. నాలుగేళ్ల పాటు సాఫీగా సాగిన ఈ పథకం 2018 సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టడంతో నిలిపివేసింది. దీంతో పాటుగా రైతులకు ఇచ్చే సబ్సిడీ విత్తనాలను కూడా నిలిపివేసింది. రైతుబంధు, రైతుబీమా పథకాలు తప్ప రైతులకు ఏ ఇతర సబ్సిడీ పథకాలను అమలు చేయలేదు. దీంతో రైతులకు సబ్సిడీ పథకాలు అందక నానా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని రైతులు, రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

సమాచార సేకరణలో ప్రభుత్వం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయ యంత్రీకరణ పథకాన్ని తిరిగి అమలు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి జిల్లాల నుంచి పూర్తిస్థాయి నివేదికలను ప్రభుత్వం సేకరిస్తోంది. ఏయే జిల్లాలో రైతులు ఎలాంటి పరికరాలు వినియోగిస్తున్నారు.. ఏయే కంపెనీలకు చెందిన ట్రాక్టర్లు, టిల్లర్లు, హార్వెస్టర్లపై ఆసక్తిని చూపుతున్నారనే సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది.

ఎగ్జిబిషన్లు నిర్వహించి..

వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, యంత్రాలకు సంబంధించి ఆయా తయారీదారుల చేత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించాలన్ని యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తును ప్రారంభించింది. ఇటీవల అన్ని జిల్లాలకు చెందిన అధికారులతో రాష్ట్ర స్థాయిలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యాంత్రీకరణ పథకం పునరుద్ధరణపై చర్చించారు. ఎగ్జిబిషన్లు పూర్తయ్యాక పథకం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగించడం వల్ల వివిధ పంటల సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అదే విధంగా సమయం కూడా ఆదా అవుతుంది. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉన్నందున యాంత్రీకరణ పరికరాల అవసరం ఎంతో ఉంది.

– జానపాటి రాజేంద్రప్రసాద్, రైతు, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

పరికరాలు అందించాలి



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలైన ట్రాక్టర్లు, టిల్లర్లు, హార్వెస్టర్లు, స్ప్రేయర్ల వినియోగం వల్ల కూలీల కొరత తీరుతుంది. ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటే యంత్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై అందించాలి.

– వెంకటాద్రి రమేష్, రైతు, వెంకటాద్రిపాలెం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. యాంత్రీకరణ పథకం కోసం చాలా మంది రైతులు ఎదురు చూస్తున్నారు. పథకం అమలు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనంగా చేకూరుతుంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఆహార పదార్థాలు కలుషితం కావొద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నల్లగొండలోని బీసీ బాలికల గురుకులంలో ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో కలిసి టిఫిన్ చేస్తున్న కలెక్టర్

నల్లగొండ : గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కలుషితం కావొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదితోపాటు సరుకులు నిల్వ ఉంచిన గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గది కిటికీలకు ఈగలు, దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వంట మనుషులు తలకు టోపీ, చేతికి గ్లౌజ్‌లు ధరించాలన్నారు. విద్యార్థులకు అప్పటికప్పుడే వండి వడ్డించాలని.. నిల్వ ఉంచిన పదార్థాలను పెట్టవద్దని ఆదేశించారు. అక్కడే పూరీలు చేసి.. విద్యార్థినులతో కలిసి టిఫిన్ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. భోజనం ఎలా ఉంది. మెనూ ప్రకారం పెడుతున్నారా? రోజూ ఎన్ని రకాల వంటకాలు పెడుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ విద్యార్థినులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌సీఓ సంధ్య ఉన్నారు.

డేటా ఎంట్రీ చాలా ముఖ్యం

నల్లగొండ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ చాలా ముఖ్యమని, వివరాలను జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇతర కారణాల వల్ల ప్రజలు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోతే ఫోన్ ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లిన వారి వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గారావు, సీపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం పూర్తిచేయాలి

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని ఐటీఐ ఆవరణలో నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)ను డిసెంబరు 4వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె ఏటీసీ నిర్మాణాన్ని పరిశీలించి మాట్లాడారు. డిసెంబర్ 4వ తేదీలోగా బాలుర స్కిల్ సెంటర్‌ను పూర్తి చేసి 5న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- నార్కట్‌పల్లిలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభ



టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం

నార్కట్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం భారత దేశప్రజల ఆలోచనలకు అనుగుణంగా లేదని దాన్ని వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలు నార్కట్‌పల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిప్-2020 విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణకు దారితీసే విధంగా ఉందన్నారు. అది ప్రభుత్వ విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 11 మంది డీఈఓలు, 33 మంది ఎంఈఓలు మాత్రమే రెగ్యులర్‌గా పని చేస్తున్నారని.. నూతన జిల్లాలు మండలాలకు డీఈఓ, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ విద్యా కమిషనర్ ఆకునూరి మురళికి వివిధ సమస్యలకు సంబంధించి పలు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా విద్యా బోధనకు కృషి చేయాలన్నారు. త్వరలో జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్లుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తున్నారని.. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షులు శ్రీనివాసచారి, బడుగు అరుణ, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు భాను ప్రకాష్, కుకుడాల గోవర్ధన్, రాదారపు భిక్షపతి, నర్రా రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, వెంకన్న, పురుషోత్తం, వెంకన్న, సురేష్, నరేష్, హేమలత, శోభ, విజయలక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ : టీఎస్ యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని జిల్లా మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్కా శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారిగా వద్యా రాజు, ఉపాధ్యక్షుడిగా నర్రా శేఖర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా బందారు అరుణ ఎన్నికయ్యారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, సామేల్

- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- త్వరలోనే కొత్త రేషన్ కార్డులు
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హుజూర్‌నగర్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు

హుజూర్‌నగర్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. ప్రజలకిచ్చిన హామీలన్నీ నూరు శాతం అమలు చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని కొండిన్య ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలందిరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి ఎక్కువ ఆయకట్టుకు సాగుకు నీరందిస్తామన్నారు. నూతన ప్రాజెక్టులు, లిఫ్టుల నిర్మాణంతోపాటు పాత వాటికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 158 మెట్రిక్ టన్నుల వరిపంట సాగై దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి సన్నరకం వరిపంటకు రూ.500 బోనస్ అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి చివరి గింజవరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశామని, మాఫీ కాని వారికి జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. త్వరలో నూతన రేషన్ కార్డులు అందజేస్తాని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

త్వరలోనే ఆరు లేన్ల రహదారి పనులు

హైదరాబాద్ నుంచి కోదాడ వరకు ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలు కానున్నాయని మంత్రి ఉత్తమ్ చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వయా హుజూర్‌నగర్-కోదాడ మీదుగా రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. త్వరలోనే హుజూర్‌నగర్, కోదాడకు రైల్వే లైన్ రానుందని మంత్రి ప్రకటించారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రజలే మా కుటుంబమని ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు మా జీవితం అంకితమని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు, గీత కార్మికులకు సేఫ్టీ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు. తొలుత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య, కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు పద్మావతి, మందుల సామేలు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్లు గెల్లి అర్చనరవి, ప్రమీల, బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఉత్తమ్

క్లుప్తంగా

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మఠంపల్లి : పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆదివారం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోజ్యాతండాకు చెందిన గర్భిణి అజ్మీరా రోజా పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో మహిళను వాహనంలో హుజూర్‌నగర్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా పెదవీడు వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువై 108సిబ్బంది సహాయంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇరువురిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో కాన్పు చేసిన 108సిబ్బందిని పలువురు అభినందించారు.

బావిలో మునిగి వ్యక్తి మృతి

వేములపల్లి : బావిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఆది వారం చోటు చేసుకుంది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆమ నగల్లు గ్రామానికి చెందిన బంటు సైదులు(37) ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీదేవిగూడెం గ్రామశివారులోని తనపొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవిగూడెం గ్రామ పరిధిలోని చలిచీమలపాలెం గ్రామానికి చెందిన చెన్నబోయిన విఠల్ తన వ్యవసాయ బావిలో మోటార్ ఇరుక్కుందని, తీసేందుకు రావాలని సైదులును తీసుకెళ్లాడు. విఠల్ ఒడ్డున ఉండగా సైదులు బావిలోకి దిగి మోటార్ తీసేందుకు వెళ్లి ఎంతకు పైకి రాలేదు. దీంతో విఠల్ స్థానికులకు సమాచారం అందించగా స్థానికులు అక్కడకు చేరుకోని పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ నరసింహారావు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో గాలించి సైదులు మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌లో ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు వెల్లడించారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

పెన్‌పహాడ్ : ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒగ్గు భిక్షం(40) అదే గ్రామానికి చెందిన దండెంపల్లి సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో స్తంభంపై విద్యుత్ తీగలు తీసేందుకు భిక్షంను కూలీ పనులకు తీసుకెళ్లాడు. విద్యుత్ తీగలను లాగుతున్న క్రమంలో స్తంభం పైన ఉన్న భిక్షం తాడు సహాయంతో విద్యుత్ తీగను అందుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

నకిరేకల్ : ఉరివేసుకొని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన పందిరి నాగమ్మ(38) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటుంది. నాగమ్మ మానసిక, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అద్దె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు సూరారం భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం



చింతలపాలెంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతలపాలెం మండల కేంద్రంలో రూ.2.61కోట్లతో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, రూ.2.98కోట్లతో ఎంపీడీఓ కార్యాలయం, రూ.2.38కోట్లతో పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం, రూ.10కోట్లతో చేపట్టనున్న మేళ్లచెరువు - చింత్రియాల రోడ్డు పనులకు, రూ.10కోట్లతో చేపట్టనున్న కిష్టాపురం నుంచి పీఆర్ సిమెంట్ వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో రోడ్లు, లిఫ్టులు మంజూరు చేయించానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని లిఫ్టులను వినియోగంలోకి తేచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. తొలుత చింతలపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి ఉత్తమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో కలెక్టర్ తేజస్‌నందలలాల్ పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వరావు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ సీతారాం, డీఈ పవన్‌కుమార్, ఏఈ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ వాసుదేవరావు, నాయకులు నరాల కొండారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సీతారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రాకు ముఖచిత్రంగా మారనున్న మఠంపల్లి : మంత్రి

మఠంపల్లి : తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న మఠంపల్లి మండలానికి రూ.80కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణంతో ముఖచిత్రం మారిపోనుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో రూ.80కోట్లతో చేపట్టనున్న హుజూర్‌నగర్-మట్టపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించానన్నారు. ముఖ్యంగా వేలాది ఎకరాల భూములకు సాగునీరందించేందుకు ఎత్తిపోతల పథకాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యవసాయ కూలీ బలవన్మరణం

కేతేపల్లి : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో ఓ వ్యవసాయ కూలీ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండంలోని తుంగతుర్తి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పుల మల్లయ్య (45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మల్లయ్య తన కూతురు వివాహంతో పాటు, కుటుంబ అవసరాల కోసం గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీరేమార్గం లేకపోవడంతో మనస్థాపం చెందిన శనివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మల్లయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, వివాహమైన కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తే సహించేది లేదు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హాలియా : బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. హాలియాలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నందుకు నిరసనగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో చేపట్టిన చలో బీసీ.. హలో హాలియా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. హాలియా పట్టణంలో కుమ్మర సోదరులు మొల్లమాంబ విగ్రహాన్ని పెడుతుంటే దురుద్దేశంతో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ నేతల విగ్రహాలను జేసీబీలతో తొలగిస్తే బీసీలంతా ఐక్యంగా రాజకీయ పార్టీల నాయకుల కుర్చీలను కూల్చివేస్తామని హెచ్చరించారు. జానారెడ్డికి పదవి వ్యామోహం ఇంకా తగ్గలేదని, తన తనయులకు పదవులు వచ్చేలా చేసుకున్నారన్నారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైశ్య కులానికి చెందిన పార్వతమ్మను పదవి నుంచి తొలగించి నరేందర్‌రెడ్డి అనే వ్యక్తికి పదవి కట్టబెట్టారని విమర్శించారు. బీసీ కులానికి చెందిన వెంకటేశ్వర్లు యాదవ్‌ను మార్కెట్ చైర్మన్ పదవి నుంచి తొలగించి శేఖర్‌రెడ్డిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బీసీలు అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందిన ఓసీలను రీకాల్ చేస్తామన్నారు. మొల్లమాంబ విగ్రహాన్ని అవమానపర్చిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉంటే కేవలం ఒక్క బీసీ, ఇద్దరు ఎస్సీ, ఒక ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారన్నారని, మిగిలిన ఎనిమిది మంది రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చెబితే జానారెడ్డి దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. త్వరలో నాగార్జున సాగర్ నియోజకవర్గంతో పాటు నల్లగొండ ఎన్జీ కాలేజీలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, బీసీ నాయకులు, వట్టె జానయ్య, మహేష్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, సుదర్శన్, పాదిలి శ్రీనివాస్, నల్లగొండ సుధాకర్, సైదులుగౌడ్, అర్జున్, కోట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

మునుగోడు: ఇసుక వాగులోని నీటి కుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మునుగోడు పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. చొల్లేడు గ్రామానికి చెందిన దోటి సత్తయ్య (31) అనే మతిస్థిమితం లేని వ్యక్తి తమ ఇంటి నుంచి అప్పుడప్పుడు బయటకు వెళ్లి రెండుమూడు రోజులకు తిరిగి వచ్చేవాడు. అదే తరహాలో ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్తయ్య తిరిగి రాలేదు. ఎప్పటిలాగే రెండు రోజుల తరువాత వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. కాగా సత్తయ్య మృతదేహం ఆదివారం ఆ గ్రామ వాగులోని ఓ నీటి కుంటలో కనిపించిందని గ్రామానికి చెందిన వంగూరి శంకరయ్య అనే వ్యక్తి బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సత్తయ్య మృతదేహాన్ని పరిశీలించి బయటకు తీశారు. సత్తయ్య మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. సత్తయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కేతేపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. కేతేపల్లిలో నూతనంగా నిర్మించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి స్మారక భవనాన్ని(సీపీఎం మండల కార్యాలయం)సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే రూ.31 వేల కోట్లు ఖర్చవుతుందని, కానీ, కేవలం రూ.18 వేల కోట్లు మాఫీ చేసి మొత్తం రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటోందన్నారు. రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 పంపిణీ ఊసే లేకుండా పోయిందన్నారు. బీజేపీ అణగారిన వర్గాల కోసం కాకుండా.. కేవలం అదానీ,అంబానీల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ.. పదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కుట్ర పన్నుతుందని విమర్శించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చింతమళ్ల లూర్దుమారయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుదాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బొజ్జ చినవెంకులు, అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, ఎల్.రాజు, శోభన్, ఎ.సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలి

చిట్యాల: ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ ప్రతిపాదిస్తున్న ఒకే దేశం-ఒకే ఎన్నికల (జమిలి ఎన్నికలు) విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కోరారు. చిట్యాలలో ఆదివారం జరిగిన డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు సంఘం జెండాను ఆయన ఎగురవేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ వడ్డెగాని మహేష్, మహమ్మద్ అక్రం, జిట్ట రమేష్, కట్ట లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పంది నరేష్, అవిశెట్టి కిరణ్, కార్తీక్, సీపీఎం నాయకులు అర్రూరి శ్రీను పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

చివ్వెంల(సూర్యాపేట) : నల్లబెల్లం, పటిక, నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను ఎక్సైజ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు.. అసిస్టెంట్ కమిషనర్ సంతోష్, సూర్యాపేట ఎక్సైజ్ ఎస్పీ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండా గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న నల్లబెల్లం 2750 కిలోలు, పటిక 40 కిలోలు, నాటుసారా 10 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న నాగయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు లునావత్ వెంకన్న, ఉపేందర్, వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేష్, ఎస్ఐలు సురేందర్ బెనర్జీ, గోపాల్‌రావు, శోభారాణి, కానిస్టేబుళ్లు అప్సర్, అయూబ్, గపూర్, క్రాంతి పాల్గొన్నారు.

చెర్వుగట్టులో భక్తజన సందోహం



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

నార్కట్‌పల్లి : కార్తీక మాసం సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో లడ్డూ ప్రసాదం కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ నిర్వాహకులు రుసుము తీసుకోని వాహనాలను గుట్టపైకి పంపడంతో గుట్టుపైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ అధికారులు, పోలీసులు స్పందించి గుట్టపైన ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాలను గుట్టు పైకి అనుమతించలేదు. ఈ వేడుకల్లో ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజ్యలక్ష్మి, వంశీ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 50 సంవత్సరాల తరువాత ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1973-75 విద్యా సంవత్సరానికి చెందిన ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు సుమారు 50 మంది కళాశాలకు చేరుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తువేసుకున్నారు. కార్యక్రమంలో ఎడ్ల కన్నయ్య, జొన్నలగడ్డ లక్ష్మారెడ్డి, డి.మోహన్, కె.హేమసుందర్‌గుప్తా, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పెల్ బీ'కి అపూర్వ స్పందన



కేటగిరీ 1 స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కేటగిరీ 2 స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నల్లగొండ పట్టణంలోని ఏకలవ్య స్కూల్‌లో పరీక్ష నిర్వహణ



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నల్లగొండ రూరల్: సాక్షి స్పెల్‌బీ మ్యాథ్స్ బీ రెండో లెవెల్ పరీక్షకు అపూర్వ స్పందన లభించింది. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఏకలవ్య హైస్కూల్‌లో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు మెయిన్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వాఫీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి వారు వ్యవహరించారు. మిర్యాలగూడలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, నార్కట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్ స్కూల్ విద్యార్థులు స్పెల్ బీ రెండో లెవెల్ పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాశారు. నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ కందికట్ల రుక్మాధర్, యాడ్స్ అకౌంట్స్ డిప్యూటీ మేనేజర్ రాపోలు నాగేశ్వర్‌రావు, రిపోర్టర్ కుంభం వెంకటేశ్వర్లుగౌడ్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కంది భజరంగ్ ప్రసాద్, సాక్షి టీవీ కెమెరామెన్ శ్రీనివాస్‌గౌడ్, ఏకలవ్య స్కూల్ ఉపాధ్యాయుడు వేణుగోపాలచారి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పదాలు నేర్చుకున్నా



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షతో కొత్త పదాలు నేర్చుకున్నా. మొదటి స్థాయి పరీక్ష పాసై రెండో లెవెల్ పరీక్ష రాశాను. కొత్త అంశాలు తెలుసుకోవడం ఆసక్తి కలిగించింది.

– జస్విత, 6వ తరగతి, శ్రీ విద్యాపీఠ్ స్కూల్, నార్కట్‌పల్లి

భయం పోయింది



పరీక్ష అంటే భయంగా ఉండేది. సాక్షి స్పెల్ బీ రాయడంతో భయం పోయింది. ఫస్టు లెవెల్ పరీక్ష పాసై రెండో లెవెల్ పరీక్ష రాయడంతో ఆందోళన అనిపించ లేదు.

– సాయిపూజ, లిటిల్ ఫ్లవర్ స్కూల్, 9వ తరగతి, మిర్యాలగూడ

ఆనందంగా ఉంది



ఫస్టు లెవెల్ పరీక్ష పాసై రెండో లెవెల్ పరీక్ష రాయడం ఎంతో ఆనందంగా ఉంది. పోటీ విధానం తెలిసిపోయి మరింత పట్టుదలతో చదివేందుకు పరీక్ష ఉపయోగపడింది.

– కె. అస్విత, 9వ తరగతి, లిటిల్ ఫ్లవర్ స్కూల్, మిర్యాలగూడ

అక్షర దోషాలు తెలుసుకున్నా



పరీక్ష రాయడం వల్ల ఇంగ్లిష్ పదాల్లో అక్షర దోషాలు తెలుసుకున్నా. ఈ పరీక్ష వల్ల భవిష్యత్‌లో రాయబోయే పరీక్షలకు ఎలా జాగ్రత్త పడాలో తెలిసింది.

– తరుణశ్రీ, 4వ తరగతి, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలు ఎలా రాయాలో తెలిసింది



అక్షర దోషాలు తెలుసుకోవడంతోపాటు పోటీ పరీక్షలు ఎలా రాయాలో ఈ పరీక్ష వల్ల తెలిసింది. మరింత పట్టుదలతో చదవడంతోపాటు అక్షర దోషాలు లేకుండా పరీక్ష రాశా.

– వైభవ్, 2వ తరగతి, శ్రీవిద్యాపీఠ్ స్కూల్, నార్కట్‌పల్లి

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



స్పెల్ బీ పరీక్ష రాయడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అక్షర దోషాలు లేకుండా, పరీక్ష అంటే భయం లేకుండా, పెరుగుతున్న పోటీ విధానంపై అవగాహన కలుగుతుంది.

– శౌరి, ఉపాధ్యాయుడు, శ్రీవిద్యాపీఠ్ స్కూల్, నార్కట్‌పల్లి

విద్యార్థుల్లో భయం పోతుంది



ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో భయం, ఆందోళన పోతుంది. పరీక్షల్లో అవలంబించాల్సిన నైపుణ్యం, మెళకువలు తెలిసిపోతాయి.

– జయరాజన్, ప్రిన్సిపాల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, మిర్యాలగూడ

పోటీతత్వం పెరుగుతుంది



స్పెల్ బీ పరీక్ష వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది. భవిష్యత్‌లో రాయబోయే అన్ని పరీక్షలకు పోటీ ఉంటుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధించే మెళకువలను ఇలాంటి పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు.

– గాత్రిశ్రీ, 2వ తరగతి, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, మిర్యాలగూడ

ఇంగ్లిష్‌లో కొత్త పదాలు తెలుసుకుంటారు



స్పెల్ బీ పరీక్ష వల్ల విద్యార్థులు ఇంగ్లిష్‌లో కొత్త పదాలు తెలుసుకుంటారు. ఒక అక్షరంతో ఎలా అర్థం మారుతుందో విద్యార్థులకు తెలిసిపోతుంది. విద్యార్థి దశలో ఇలాంటి పరీక్ష రాయడం వల్ల ఉద్యోగ పోటీ పరీక్షలు తేలికగా రాస్తారు.

– ఎండీ.కలీమ్, కరస్పాండెంట్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, మిర్యాలగూడ